

# స్నేహం పగుళ్ళు

నరేష్ నున్నా

నీరదాకాశం
కారుమబ్బుల గొడుగు కింద బిక్కు బిక్కుమంటూ రాత్రి.

లిప్త క్షణాల మురిపించే మెరుపు ఓదార్పు కావచ్చు. లేదా దిగంతాలకు ఆవరించిన చీకటి సత్యాన్ని గుర్తుచేసి క్షోభపెట్టే శిక్షా కావచ్చు.

జ్ఞాపకాలూ అంతే,

తోడుగా ఉండి వెలుగు నింపే ప్రయత్నం చేస్తాయి కొన్ని మిణుగురులు. ఏకాకితనాన్ని పోగొట్టే ఆ వృధా యత్నంలో ఏకాంతమే భగ్నం కావచ్చు.

కొన్ని స్నేహాలు కూడా అలాంటివే ఆశ.

కానీ, ఎంతకీ మేఘం కరగదు.

వర్షమూ రాదు -

ట్రింగ్ ... ట్రింగ్ ...

'...హలో .. అవును! ఏమిటీ మీ అమ్మాయి లేచిపోయిందని మా పేపర్లో వచ్చిందా. సంతోషం ... ఓ...సారీ విచారం! ఊ...చెప్పండి...అలాగా పాపకి పన్నెండేళ్లయినా ......కనీసం రెండేళ్లు ఆగితే బాగుండేదేమో......బహుశా కాస్త ప్రీమెచ్యూర్డ్.....మళ్లీ సారీ! ఎనీవే కౌంటర్ ఏదైనా రాసివ్వండి....తప్పకుండా పబ్లిష్.....'

'.....ఏమిటా చెత్త దబాయింపు.... ఇంత పెద్ద పేపర్లో గుప్పెడు అప్పుతచ్చులు.... అదే అచ్చుతప్పులు.....ఫర్వాలేదు లేద్దూ...'

'ఎన్‌టిడిడి కాల్? బర్రె రైలు కింద పడితే రైలుకేమీ కాలేదా ... దీనికి ఫోన్ చేసావా? ఏం రిపోర్టర్‌వయ్యా! ధూత్ పెట్టేయ్ ఫోన్'

'ఈ దొంతర తలకింద పెట్టుకోవడానికా?...'

'లేదు సార్! ఏఐసిసి మీటింగ్స్ కదా...

టి.పి. ఐటమ్స్ ఇలా కుప్పలు...తెప్పలు ...'

'చూడండి సార్! కంపోజర్స్ టీకెళ్ళి గంట దాటింది. ఒక్క వార్త కూడా...'

'ఎడిటోరియల్‌లో తప్పులా? నీకు సిగ్గుగా లేదేమో గానీ నాకు మాత్రం చచ్చే...'

'మా కాలనీ పక్కనే ఎయిర్‌పోర్ట్. చాలా డిస్టబెన్స్‌గా వుంది. ఎయిర్ పోర్ట్ షిఫ్ట్ చేయాలని ధర్నా చేయాలనుకుంటున్నాం. రేపు మా వెల్‌ఫేర్ ఆఫీసులో ప్రెస్‌మీట్. తప్పకుండా......'

'వాడికి లైన్ మొదలెట్టడమూ రాదు, కంప్లీట్ చేయడమూ రాదు. కామాబదులు ఫుల్‌స్టాప్ పెట్టే పిడత నాకొడుకు. నిన్నా మొన్నటిదాకా స్ట్రింగర్. ఇప్పుడు స్టాఫ్ రిపోర్టర్.... అసలా బేవకూఫ్‌గాడు ఎడిటర్ కాళ్ళు నాకి .......'

'......చూడు సాయి ఎంత అన్యాయమో వారం రోజులు సస్పెన్షన్. ఏదీ బాధ్యతగా చేయకూడదోయ్. 'దివంగత ప్రధాని

పి.వి...' అని కంపోజ్ చేసాను. అంత చిన్నతప్పుకే ఇలా......'

.....................

.....................

....నిర్విముక్తం...నిర్విముక్తం....పారిపోయే ప్రయత్నాల్లో బిగిసిపోతున్న ఉచ్చు.

ఊబిలో ఈత.

కలల కాగితపు పడవలకీ అంటుకొని వదలని బురద.

"హాయ్ మోహన్! కొలువు అయ్యిందా? సో...ఇంటికి? వెళ్ళవులేద్దూ. ప్రెస్‌క్లబ్‌వైపే చూడడం లేదసలు...అదుగో 'నో' అనేట్టున్నావ్. ఎంత అఫ్‌మాన్ అవర్ జస్ట్ ఫర్ రిలాక్సేషన్..."

మొహమాటం..... 'సరే'.

ప్రెస్‌క్లబ్.....క్లబ్ ఫర్ ప్రెస్......డిప్రెస్డ్, సప్రెస్డ్.....అందరూ.......

'ఆఫ్ట్రాల్ రామ్మూర్తి. కోన్‌కిస్కా మెంబర్‌గాడు, నన్ను......దటీజ్ సెక్రెటరీని, నన్ను నిలదీస్తా.......మాధవ్ నా మాట వింటున్నావూ?

నాల్గో రౌండ్ దాటినట్లుంది. పిండి ముద్దల్లా జారిపడ్తున్నాయి మాటలు.

'మాదవ్ కాదు...మోహన్' సవరించాను.

'ఓ సారీ బ్రదర్! మోహన్.... ఏస్.....మోహన్! అసలు న్యాయం...'

పాలిన గాజు గ్లాసుల్లో లేత ఎరుపుగా మండుతోంది 'రిలాక్సేషన్'. 'ఎస్కేప్'... కాదు కాదు... 'ఇన్‌స్కేప్' అవ్వడానికి ఒకే ఒక తోవ. చీకట్లోంచి, చీకట్లోకే దారితీస్తున్న అన్ని దారుల్నీ మరిపించే దోవ. శిశిరాలు గడిచి, శిశిరాలే ఎదురొతున్న కాలాన్ని గుర్తుచేయని ఔషధం.

కానీ ఎన్నింటిని మరిచినా, ఈ ఒక్క దారిని మరవను. లేను. రాత్రిలా వాలుతున్న నిద్ర రెప్పల మీద బరువెక్కుతుంటే, కునుకుపాటు నిరీక్షణాల్ని దొర్లిస్తూ అర్ధ భాగమైన పాపాన్ని మౌనంగా భరించే రాధీ, ఆ దారి చివరే ఒంటరిగా ఉంటుంది. నా రాధీ కోసం, నాకూ ఇల్లు ఉందని గుర్తు చేసే రాధీ కోసం .... ఈ దారిని మరవలేను.

'యస్! న్యూస్ ఎడిటర్ మోహన్? వెయిట్ మూమెంట్... మోహన్‌జీ మీకే ... కాల్ ఫ్రమ్ ఢిల్లీ...'

ఢిల్లీ?! ఎవరబ్బా...

'అవును! మోహన్ హియర్...'

'.........................'

....... ఎవరు? శాంతి?...శాం.....తి....

**మైక్రోస్కోప్‌లకి కూడారకని శాంతి!**

'అవునురా...మోహన్...బుజ్జీ...నేనే...శాంతినిరా!

నిజమేనా? ఎన్ని పురాజన్మల సావాస పరిమళం...ఈ టెలిఫోన్ తీగల్లోంచి...ఇరవై ఏళ్ళు ప్రవాసమైపోయిన జీవితాన్ని గులాబీ పొత్తిళ్ళలో అందిస్తున్న స్వరం.

నా శాంతి...

నాకప్పుడు మూతిమీద వస్తున్న వెంట్రుకలు, ముఖం మీద మొలుస్తున్న మొటిమలు,యవ్వనారంభాన్నిమరీ తెలియజేస్తున్న వయసు. ఐదుగురు అక్కల్ని నాకిచ్చి, మరి తానిక వెళ్ళిపోయిన అమ్మ లీలగా కూడా గుర్తు లేదు. తల్లిని మింగాడని నన్నెవరూ ఈసడించలేదు. ఐదుగురు అమ్మల ఒళ్ళో పెరిగిన 'అదృష్టవంతు'డ్నని అన్నారు గానీ - బహుశా వాళ్ళ అరిచేతుల మీద, నాన్న గెండెల మీదే నడిచానేమో. నాన్న సర్పంచ్ అవ్వడం వల్ల మాత్రమే కాదు, ప్రేమతో దీర్ఘమైన బాహువుల్తో ఊరంతటినీ కౌగిలించుకోవడం వలనే, నాన్న అవరణ తమదిగానే మసలేవాళ్ళంతా. నాన్నలాగే విశాలమైన ఇల్లు ఎప్పుడూ ఓ సత్రంలా ఉండేది. పెద్దక్కలిద్దరూ తలమునక అతిథి మర్యాదల్లో మునిగి ఉండేవారు. వీటన్నింటికీ దూరంగా నాకో ప్రత్యేకమైన లోకముండేది. కిలకిలా రావాల కల కూజితాలలో లోగిలిని నిత్యవసంతం చేసే అక్కల స్నేహితురాళ్ళ మధ్య రంగుల లోకం. అప్పటి వారి నఖక్షతాల్ని భరించింది మితాయి తాయిలా కోసమే.

వాళ్ల కంటికి నేనో చంటాడ్ని. నోట్లో వేలెవ్వరూ పెట్టలేదుగానీ, కొరకలేనని మాత్రం ఖచ్చితంగా అనుకునేవారు. కొరికే వయసు వచ్చిందని గుర్తుచేసింది శాంతి. నాలుగో అక్క కమల క్లాస్‌మేట్ శాంతి. అందర్నీ 'అక్క' అనే పిలిచేవాడినే గానీ, శాంతిని పేరు పెట్టే పిలిచేవాడిని మొదటినుండి. కారణం ఇప్పటికీ ఇతమిద్దంగా తేల్చి చెప్పలేను. నాలో యవ్వన రక్తాన్ని తొలిగా గుర్తించి, ఈ స్పృహ నాలోనూ కలిగించినందువల్ల కాబోలు.

'రేయ్ బుజ్జీ...జాకెట్ హుక్స్ పెట్టరా వెనక..' కొండచిలువ బద్ధకపు మెలికలుగా నవ్వుతూ అడిగిందొకసారి. చర్రున కోపం వచ్చింది కమలక్కకి.

'ఏమిటే అది శాంతీ మరీనూ.. చంటీ నువ్వెళ్లరా అవతలకి..' అంటూ ఇద్దరిని కసిరింది.

మరింత మురిపంగా నవ్వుతూ 'ఏరా భడవాః నువ్వు మగాడివా ఖర్మ చెప్పరా బాబూ' అంది శాంతి.

పక్కన కమలక్క వున్నందుకు నా దురదృష్టం మీద అప్పటికి తెలిసిన అన్ని బూతుల్ని ప్రయోగించుకొని, చాలా క్యాజువల్‌గాచెప్పేందుకుప్రయత్నించాను ప్రయత్నించాను.

'బొత్తిగా కాదు'.

అప్పటికైతే వదిలేసింది కానీ, దొంగగా పాకే నా చూపుల్ని, అనాకృతమైన వివశాల్ని రెడ్‌హాండెడ్‌గా పట్టుకొని నన్నాడించేది. ఇప్పటి అనుభవాల అరిందాతనంలోంచి ఆలోచించినా, అప్పటి 'శాంతి'ని వర్ణించలేను. సర్వకాల సర్వావస్థలోనూ నన్ను వదలని గుండె చప్పుళ్ల లయాత్మక జీవన సంగీతాన్ని వింటున్నట్లుండేది శాంతి తలపుకు రాగానే -

'నన్ను ముద్దుపెట్టుకోరా బడుద్దాయ్'. అన్నప్పుడు కరిగే వెన్నెలా చెక్కిళ్ళను సుతారంగా తాకీతాకని నా పెదాల్ని తన పెదాల్లో రెండు నిమిషాలు దాచేసినప్పటి బాధనందం యుగాల దూరం తొడుంటుంది నాకు. తను పెట్టే తీయని తొడపాశాలకు జడిసే కెంజాయ వర్ణాల నా లజ్జను పొంట్ల చుటున తొలిగా దాచింది కూడా.

హఠాత్తుగా అడ్డు నిలిచిన కొండరాతిని అయోమయంగా ఢీకొని, తుంపర్లయి విరిగే కెరటాల ఉద్వేగాన్ని తనతో కలిపి చూస్తూ, దొర్లించిన సయంకాలాలెన్నో. తన గుండెల మీద వత్తిగిల్లినప్పుడే, కడలి అనంతం పెడుతున్న ఘోషకు అర్థం తెలిసిందేమో.

తనని నాలుగు అంగుళాలు పైకెత్తేసి, నలుదిశల్నీ జయించిన గర్వంతో, నాలుగు గ్రీష్మాల అంతరాన్ని ఊహల్లోంచి కూడా తుడిచేసేవాడిని. కోటి సూర్యప్రభలతో వెలిగిన ఆ ఘడియల్ని 'ఏకాంత' మంటారని కూడా తెలియని వయస్సులో నా ప్రపంచమంతా నిండిపోవడమే కాదు. నాలో ప్రపంచాన్ని నింపింది కూడా శాంతే. 'చూపు' నిచ్చింది అమ్మ అయితే, 'దృష్టి' నిచ్చిన మరో అమ్మ శాంతి.

సృష్టి రచనకి ఆముఖం రాసిన ఆ దయాహస్తాలతోనే, నన్ను లాలించి, నాణెం రెండో ముఖాన్ని చూపిన ప్రాణమయి శాంతి. 'పసి పిల్లాడిని చెడగొట్టింద'నీ, 'నీచంగా వాడుకుంద'నీ కమలక్కతో సహా అందరూ వెలేస్తూ వేసిన నిందల్ని రెప్పపాటు చూపుతో నిర్లక్ష్యంచిన శాంతిని, హడావుడిగా బిగిసిన పలుపుపాశాలు నాకు దూరంగా లక్కెళ్లిపోయాయి.

ఇనుప ఊచల పంజరంతో స్టేట్స్‌కు ఎగిరిపోయేముందు, నన్ను కావలించి నిలువెత్తు శోకమై తడిపేసిన నా శాంతి...

...ఇన్నేళ్లకు బీడువారిన ఈ నేల పగుళ్లని తడిపేందుకు ...మళ్లీ ఇలా -

నెత్తుటి పాశాలకీ, బంధనాలన్నింటికీ దూరమైన ఏకాకి, అక్క స్నేహితురాలెవరో వస్తుందని, రిసీవ్ చేసుకోవడానికి ఇంత కంగాళీ అవుతున్నదేమిటనే ఆశ్చర్యమే రాధీ నిండా.

ఏమని చెప్పాలి? ఏదన్నా చెప్పటానికైనా ఏముంది? నిర్వచనమే లేని ఈ బంధానికి అరిగిపోయిన ఏ పేరు పెట్టాలి?

నేనేమన్నా చెప్తామని కూడా ఆశించిన ఆశ్చర్యాల రాధీ, నాతో కలిసే ఎదురు చూసింది ఎయిర్ పోర్ట్‌లో.

మరింత పసిమి తేలిన రంగు...చూపుల్లో కూడా -

చెంపల దగ్గర కాస్తంత నెరిగిన జుట్టు సవరించుకుంటూ 'గుర్తు పట్టావా...' అన్నట్లు తెల్లని నవ్వుల పలకరింపు - శాంతిదివాకర్!

పొరలు పొరలుగా పేరుకున్న మైనపు దుఃఖం నిశ్శబ్దంగా కరుగుతున్నా, కల్చర్డ్ దాపరికాల చాటున ఇగిరిపోయిన కన్నీళ్ల గొంతుని నొక్కేసాయి.

ఏ స్నేహాలు లేని కొత్త పరిచయాలతో, సిగరెట్ పైపే మార్చుకొని కరచాలించిన దివాకర్, 'నమస్తే అంకుల్...' అంటూ చేతులు జోడించిన దీప్తి, శశాంకలే నా శాంతికి అడ్డు నిలిచిన కంచెలౌతారనీ, 'హౌడూయూడూ' అంటూ, బొకేనందించిన రాధీ, నీతినియమాల మట్టి గోతుల్లో నన్ను నిండా కప్పెట్టుతుందనీ, తిరిగి వచ్చిన మా హృదయాల సాక్షిగా ఇద్దరమూ ఊహించలేదు ఆ క్షణంలో -

లెక్కకు అందని ఉల్కలు నిండిన నిర్దయాకాశ నీలిమలో దిక్కూచి నక్షత్రం ఆచూకీ ప్రహేళికే నాకు మరెప్పటికీ......


రాశి
పి.వి.సి.పైపులు
IS:4985


రాశి
పి.వి.సి.పైపులు
TEJA PUBS
తయారు చేయువారు
శ్రీరామ పోలిమర్స్ లిమిటెడ్
రాకేష్ మాన్షన్, లబ్బీపేట, బందర్‌రోడ్ విజయవాడ 10 ఫోన్స్ : 473306, 473307